నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 23 అక్టోబర్ 2024 | NIZAMABAD

## మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తింది. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, తిరిగి సాయంత్రం వేళలో ఒకే దగ్గరికి చేర్చి తడవకుండా పట్టాలు కప్పడానికి కూలీలకు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

**- కార్తీక్, రైతు, హెగ్డోలి, కోటగిరి మండలం**

## తూకం ప్రారంభించాలి..



గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ తూకం ప్రారంభించలేదు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. ధాన్యం ఆరబెట్టినప్పటికీ తిరిగి వర్షం కురియడంతో తడిసి పోతున్నది. ధాన్యం రంగుమారడంతో పాటు మొలకలు వచ్చే అవకాశం ఉన్నది. అధికారులు వెంటనే స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి.

**-కుమ్మరి సంగమేశ్వర్, రైతు, శెట్పల్లి, లింగంపేట మండలం**




# ‘భరోసా’పై సర్కారు దగా

- రైతుభరోసా వెంటనే విడుదల చేయాలి
- బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్
- బీర్కూర్, దామరంచలో ధర్నా



బీర్కూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం వానకాలంలో రైతుభరోసా ఇవ్వకుండా రైతులను దగా చేస్తున్నదని బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. మంగళవారం వారు బీర్కూర్ మండల కేంద్రంతోపాటు మండలంలోని దామరంచ గ్రామంలో ధర్నా నిర్వహించారు. దామరంచలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు జుబేర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి రైతులను దగా చేసిందని విమర్శించారు. రైతుభరోసా వెంటనే విడుదల చేయాలని, రైతులందరికీ రుణమాఫీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, గణేశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు



దామరంచలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# తడిసిన ధాన్యం.. రైతుల దైన్యం

- తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలు
- రైతులకు కనీస సౌకర్యాలు కరువు
- పలు గ్రామాల్లో ధాన్యానికి మొలకలు
- కొన్నిచోట్ల ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు

పోతంగల్/లింగంపేట, అక్టోబర్ 22 : ఉమ్మడి జిల్లాలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాత ఆగమవుతున్నాడు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ సరైన సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో వర్షం కురిస్తే రైతులు చెట్లకింద తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మంగళవారం తడిసిన ధాన్యం ఆరబెడుతుండగా ఓ యువ రైతు పిడుగుపడి మృత్యువాతపడ్డాడు. అతడి తండ్రితోపాటు మరో మహిళకు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. కేంద్రాల్లో సేదతీరేందుకు కనీసం టెంట్, తాగునీరు కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### తడిసి.. మొలకలు

పోతంగల్ మండలంలోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. దీంతోపాటు రంగుకూడా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టి వడ్లను శుభ్రం చేస్తున్నారు. తుకానికి సిద్ధమైన తరుణంలోనే అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నది. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోతున్నది. ప్రతిరోజూ కూలీలతో కలిసి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, తిరిగి సాయంత్రం ఒకే దగ్గరికి చేర్చి తడవకుండా టార్పాలిన్లు కప్పినప్పటికీ వర్షపు నీటితో ధాన్యం మొలకెత్తుతోంది. ఈ పనుల కోసం ఒక్కో కూలీకి ప్రతిరోజు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



హెగ్డోలిలో ధాన్యానికి మొలకలు వచ్చాయని చూపుతున్న రైతు

## కేంద్రాలకు ధాన్యం.. ప్రారంభంకాని తూకం

లింగంపేట మండలంలోని శెట్పల్లి, కోమటిపల్లి, పోతాయిపల్లి, కన్నాపూర్, పోల్కంపేట గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చినా ఇప్పటివరకూ తూకం ప్రారంభం కాలేదు. దీంతో అమ్మకానికి తెచ్చిన ధాన్యం తడిసిముద్దయ్యింది. ధాన్యం ఆరకముందే తిరిగి వర్షం కురియడంతో ధాన్యం రంగుమారడంతోపాటు మొలకలు కూడా వచ్చే ఆవకాశ ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా తూకం ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# ధాన్యం ఆరబెట్టేందుకు వెళ్లి.. విగతజీవిగా మారి..


- పిడుగుపాటుకు యువరైతు మృతి..
- తండ్రితోపాటు మరో మహిళకు తీవ్రగాయాలు
- నాగిరెడ్డిపేట మండలం బొల్లారంలో ఘటన

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 22: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తండ్రితో కలిసి వెళ్లిన ఓ యువరైతు పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. తండ్రితోపాటు మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా.. దవాఖానకు తరలించారు. ఈ ఘటన నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఏఎస్సై ఉమేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం గ్రామానికి చెందిన మంద నాగభూషణం, తన కుమారుడు వెంకటేశ్ (26)తో కలిసి మంగళవారం ఉదయం ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లారు. మధ్యాహ్నం ఒక్కసారి వర్షం కురవడంతో పక్కనే ఉన్న ఓ చెట్టుకిందికి తండ్రి కొడుకుతోపాటు కాశవ్వ అనే మహిళా రైతు వెళ్లారు. ఇంతలో పిడుగుపడడంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా.. తండ్రి నాగభూషణంతోపాటు కాశవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఎల్లారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మృతుడు వెంకటేశ్‌కు ఎనిమిది నెలల క్రితం వివాహం కాగా.. భార్య రమ్య నాలుగు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హస్తంలో లొల్లి

- నామినేటెడ్ పదవిపై పెదవి విరుపు
- అప్రాధాన్య పదవి కట్టబెట్టారని అలక
- పదవికి దూరంగా ఉండాలని నిర్ణయం
- జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిరసన
- కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తి జ్వాల







నిజామాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల లొల్లి రోజురోజుకూ తీవ్రమవుతున్నది. పదవుల్లో చోటు దక్కక కొందరు అసంతృప్తితో రగిలి పోతుంటే, అప్రాధాన్య పదవి కట్టబెట్టడంపై మరికొందరు రగిలి పోతున్నారు. ఇలా ఎవరికి వారు నిరసనాస్త్రాన్ని సంధిస్తూ అధిష్టానం తీరుపై గుర్రుమంటున్నారు. ఎల్లకాలం పార్టీని నమ్ముకుని బతుకుతున్న వారిపై అటు ప్రభుత్వం, ఇటు పీసీసీ అధినాయకత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. సామాజిక న్యాయం పాటించకుండా పదవుల భర్తీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనంపై దళితులు, బడుగు, బలహీన వర్గాల నేతలంతా తీవ్ర స్థాయిలో రగిలి పోతున్నారు. కీలక పదవులన్నీ అగ్రవర్ణాలకే పంచేస్తుండడం, మిగిలిన, అప్రాధాన్య పోస్టులు అట్టడుగు వర్గాలకు కట్టబెట్టి చేతులు దులుపుకోవడంపై మండిపడుతున్నారు. ఇదేం తీరు.. ఇదేం పద్ధతి? అంటూ పదవులు స్వీకరించేందుకు అయిష్టత చూపుతున్నారు. తాజాగా డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్‌ను వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌లో సభ్యుడిగా ప్రభుత్వం నియమించగా, ఆ పోస్టు తనకు వద్దే వద్దంటూ గడుగు అలక బూనినట్లు తెలిసింది. ఎలాంటి హంగూ ఆర్భాటం లేని పదవిని దళితులకు అప్పగించి, ప్రాధాన్యత కలిగిన పదవులను ఇతర వర్గాలకు అప్పగించడం ఏమిటని ఆయన పీసీసీ నాయకత్వాన్ని నేరుగా ప్రశ్నించినట్లు సమాచారం.

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒకే రోజు అధికార పార్టీకి రెండు మింగుడు పడని ఘటనలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత గడుగు గంగాధర్ నిరసనాస్త్రాన్ని సంధించడం, అటు జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు సంధిస్తూ కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టడం చర్చనీయాంశమైంది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా గడుగు గంగాధర్ పార్టీని నమ్ముకుని పని చేస్తున్నారు. కానీ ఆయనకు అప్రాధాన్య పోస్టు కట్టబెట్టిన వైనం విమర్శలకు తావిచ్చింది. ఏండ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న దళితులకు కాంగ్రెస్ ఇచ్చే గౌరవం ఇదేనా? అని నిలదీయడం పీసీసీ ముఖ్య నాయకులను మీమాంసలో పడేసినట్లు తెలిసింది. తొమ్మిదేండ్లపాటు డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన దళిత నాయకుడికి అధిష్ఠానం కనీస మర్యాద ఇవ్వకపోవడంపై పెద్ద దుమారమే రేగుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో కీలక పదవులేవీ దళిత వర్గానికి కేటాయించకపోవడంపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు, జగిత్యాలలో తన ముఖ్యఅనుచరుడి హత్యోందంతంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మొన్నటి లోక్‌సభ ఎన్నిక ల్లో పోటీ చేసి ఓడిపోయిన తర్వాత జీవన్‌రెడ్డి పట్ల కాంగ్రెస్ పార్టీ ఒకింత చులకన భావాన్ని ప్రదర్శిస్తున్నట్లు పార్టీలో చర్చ నడుస్తున్నది. రేవంత్ రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ పెద్దలు దూరం పెట్టారు. జగిత్యాల ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో మొదలైన జీవన్‌రెడ్డిలోని అసంతృప్తి సెగ తన అనుచరుడి హత్యతో మరింత పెరిగింది. జగిత్యాలలో ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై జీవన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. నీ పార్టీ వద్దు... మీరు వద్దు అంటూ చేతులు జోడించి దండం పెడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ స్వయంగా ఫోన్ చేసి సముదాయించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు ముక్కున వేలేసుకుంటున్నాయి.

### అసలేం జరుగుతున్నది..?

ముందు వచ్చిన చెవుల కంటే, వెనుక వచ్చిన కొమ్ములే పెద్ద అన్నట్లు మారింది కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి. అధికారమే పరమావధిగా గోడ దూకి వస్తున్న లీడర్ల తీరుపై పాత కాంగ్రెస్ నేతలంతా కినుక వహిస్తున్నారు. పదేండ్ల పాటు అధికారంలోకి లేకపోయినప్పటికీ కష్టాలు, నష్టాలు భరించిన నాయకులను కాదని, కొత్తగా వచ్చిన వారిని ప్రోత్సహిస్తుండడంపైనా పాతతరం నేతలంతా ఆగ్రహంతో ఊగిపోతున్నారు. పదవులు వచ్చిన నేతలంతా ఓ వైపు, పదవులు రాక ఇబ్బందులు పడుతున్న నేతలు మరోవైపు అన్నట్లు చీలిపోయారు. దీంతో కింది స్థాయిలో నాయకత్వమంతా ఏమి చేయాలో తెలియక గందరగోళంలో పడిపోయారు. మొన్నటి వరకు అధికార బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరించిన నాయకులు ఇక్కడకు వచ్చి హడావుడి చేస్తుండడంపై పార్టీలో, బయట జోరుగా చర్చ జరుగుతున్నది.



## క్రాప్ సర్వే చేయట్లేదని ఏఈవోలపై వేటు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 22: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమానికి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదని జిల్లాలో నలుగురు ఏఈవోలను సస్పెండ్ చేశారు. క్రాప్ సర్వే చేయాలన్న కేంద్రం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. అయితే, ఇప్పటికే పని ఒత్తిడి కారణంగా విసిగి పోతున్న ఏఈవోలు సర్వేకు వెనుకడుగు వేశారు. ఈ నేపథ్యంలోనే సర్వే చేయకపోవడం, దానికి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోక పోవడాన్ని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం.. జిల్లాలో నలుగురు ఏఈవోలను సస్పెండ్ చేసింది.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**



వినాయక్‌నగర్, అక్టోబర్ 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అధికారంలోకి వచ్చి పదినెలలవుతున్నా ఒక్క గ్యారెంటీకి దిక్కులేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అంటూ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. దసరాలోగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పగా.. ఇప్పటికీ అతీగతి లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ అంటూ రైతులను నిండా ముంచాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రికి నిజామాబాద్ కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ జిల్లా అభివృద్ధిపై లేదన్నారు.

## రైతుల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీజీగౌడ్

ధర్పల్లి, అక్టోబర్ 22 : నిన్న, మొన్నటి వరకు రైతుభరోసా అందిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసి రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేయడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయించారని తెలిపారు. వరికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు జూన్‌లోనే రైతుబంధు డబ్బులు అందేవని గుర్తుచేశారు. రాష్ట్రంలో 40 లక్షల మంది గీత వృత్తిని నమ్ముకుని కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం గీత కార్పొరేషన్‌కు రూ. 500 కోట్లను కేటాయించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, నాయకులు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఎస్‌పీ లింగం, అబ్దుల్ మజీద్, బద్దం నడ్పి గం గారెడ్డి, సబావత్ శ్రీనివాస్‌నాయక్, బీఆర్‌ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ సస్పెన్షన్

- విష్ణుమూర్తిపై వేటు వేసిన డీజీపీ
- టాస్క్‌ఫోర్స్‌లో విచ్చలవిడిగా అక్రమాలు
- వెలుగులోకి తెచ్చిన ‘నమస్తే తెలంగాణ’
- విచారణ జరిపించిన అప్పటి సీపీ
- డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు
- తాజాగా విధుల నుంచి తొలగింపు

నిజామాబాద్, అక్టోబర్ 22, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ విభాగంలో అనేక అక్రమాలకు పాల్పడిన ఏసీపీ విష్ణుమూర్తిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా విష్ణుమూర్తి భారీగా అవినీతికి పాల్పడిన వైనాన్ని ‘నమస్తే తెలంగాణ’ వెలుగులోకి తీసుకొచ్చింది. దీన్ని సీరియస్‌గా పరిగణించిన అప్పటి పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ విచారణకు ఆదేశించారు. ఏసీపీ అక్రమాలకు పాల్పడ్డాడని తేలడంతో నివేదికను డీజీపీ కార్యాలయానికి పంపించారు. దీంతో విష్ణుమూర్తిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు, తాజాగా ఆయనను విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### నిఘా వర్గాల నివేదికతో..

నమస్తే కథనంతో ఉన్నతాధికారులు టాస్క్‌ఫోర్స్ విభాగంపై నిఘా పెట్టారు. ఏడాది కాలంలో జరిగిన అక్రమాలపై పరిశోధన జరిపించగా, అనేక కేసుల్లో డబ్బులు చేతులు మారినట్లు వెలుగుచూసింది. దీంతో టాస్క్‌ఫోర్స్ విభాగంలో పని చేసిన కింది స్థాయి పోలీసులపైనా సీపీ వేటు వేశారు. కానిస్టేబుళ్లు రాములు, సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, మరో నలుగురు కానిస్టేబుళ్లను టాస్క్‌ఫోర్స్ విభాగం నుంచి తప్పించారు. టాస్క్‌ఫోర్స్‌ను ప్రక్షాళన చేస్తున్న తరుణంలోనే సీపీ కల్మేశ్వర్ బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

### ఇష్టారాజ్యం..

సీపీ బదిలీతో పోలీసు శాఖలో విచ్చలవిడితనం పెరిగిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త అధికారి వచ్చే లోగా జేబులు నింపుకోవాలని చాలా మంది ఖాకీలు దూకుడు ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. సీపీ బదిలీ తర్వాత కొత్తగా ఎవరిని నియమించలేదు. ఇన్‌చార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ కామారెడ్డి జిల్లా బాధ్యతల్లోనే తలమునకలై ఉన్నారు. దీంతో బోధన్ డివిజన్‌లోని పలువురు పోలీస్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇక, మొన్నటివరకు కల్మేశ్వర్ తీరుతో కమిషనరేట్ పరిధిలో పని చేసేందుకు ముఖం చాటేసిన ఎస్సైలు, సీఐలు ఇప్పుడు జోరుగా పైరవీలు చేసుకుంటున్నారు. పాత పరిచయాలను, సామాజిక వర్గాన్ని బలంగా ముంగిట పెట్టి ప్రాధాన్యత ఉన్న పోస్టింగ్‌లను తెచ్చుకునే పనిలో తలమునకలయ్యారు. ఏడాదిగా లూప్‌లైన్‌లో పని చేస్తున్న ఎస్సైలు సైతం తెరమీదకు వచ్చేందుకు పైరవీలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

### అనుకూలమైన అధికారి కోసం..

మరోవైపు, తమకు అనుకూలమైన అధికారి కోసం కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీఎం స్థాయిలో పైరవీలు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. పూర్వ సీపీ కల్మేశ్వర్ అధికార పార్టీ ఎమ్మెల్యేల మాటను సైతం పెడచెవిన పెట్టి తన పని తాను చేసుకుంటూ పోయారు. ఇకపై అలాంటి క్యారెక్టర్ ఉన్న అధికారులను కాకుండా చెబితే వినే వారిని సీపీగా తెచ్చుకోవాలని అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.